ఆర్టికల్

డాక్టర్ పొన్నగంటి హనుమంతరెడ్డి

# గురజాడకు మార్గదర్శి...

"దేశమంటే మట్టికాదోయ్
దేశమంటే మనుషులోయ్", అంటూ మనుషి లోకెళ్ళిన చైతన్యపు ప్రవంతులను సైతం మెత్తగా తట్టిలేపి, ఉరకలూ పరుగులెత్తించగలిగిన ప్రజ్ఞాశాలి గురజాడకు... మార్గదర్శి వేమనే అంటే అతిశయోక్తి కాదు!

వేమనలోని భావ సంపద గురజాడలో అనేకం అచ్చుగుద్దినట్లు కన్పిస్తాయి. వేమన ఆటవెలది ఛందస్సులో తన సందేశాన్ని వినిపిస్తే, గురజాడ "ముత్యాల సరం"లో తన భావాలను పలికించారు.

"ఆటవెలది ఛందస్సును తాను స్వయంగా సృష్టించకపోయినా వేమన దాన్ని సొంతం చేసుకున్నట్టే, గురజాడకూడా జానపద జీవితంలో ఒదిగి ఉన్న ముత్యాల సరాన్ని తనదిచేసుకున్నారు" అని వేమనకీ, గురజాడకీ గల సామ్యాన్ని నిర్వచించారు శ్రీశ్రీ.

తెలుగులో ప్రతిభా వంతులైన కవులు సంప్రదాయాల్ని వదల్లేక పూర్వకావ్య లక్షణ సూత్రాలకు కట్టుబడి పాత చింతకాయ పచ్చడి వంటి ఇతి వృత్తాల్ని స్వీకరించి కావ్యాలు రచించినా, వాటిలోని కథ అందరికీ తెలిసిందే అయినా, అందులోని పాత్రల్లో అక్కడక్కడా మెరుపుల్లా తళుక్కుమని మెరిసే... కవియొక్క స్వీయానుభవాలు మాత్రమే పాఠకుల్ని పట్టి నిలదీస్తాయి.

కావ్యకళలోని ఈ రహస్యాన్ని వేమన పసికట్టారు. ఇతి వృత్తం ప్రధానం కాదనీ, అనుభవాలు వాటి కాళ్ళ మీదే నిలబడి ప్రకాశిస్తాయనీ గాధా సప్తశతి వల్ల, తెలుగులోని అనేక శతకాల వల్ల శ్రీనాథుని లాంటి మహాకవుల చాటువుల వల్ల... వేమన తెలుసుకున్నారు!



అందువల్లే ఆయన తన కవితా కన్యమీద లేనిపోని శాస్త్ర లేపనాల్ని రుద్దలేదు. మధురాతి మధురమైన ఆటవెలది ఛందస్సునే తన కవితకు స్వీకరించారు.

తన దేశ సంచారంలో తనను ఏ అనుభవం కదిలిస్తే, ఏ విషయం ఆకర్షిస్తే వాటిమీద పద్యాల్ని చెప్పుకుంటూ పోయారు.

కట్టమంచి వారన్నట్టు పనిగట్టుకుని కావ్యలక్షణ శాస్త్రాల కొలతల ప్రకారం కత్తిరించి, నిర్మించిన కవిత్వం కాదు వేమనది. ప్రతి పండితుణ్ణీ, పామరుణ్ణీ కూడా పట్టి నిలవేస్తుంది అతని పద్యం.

"పుస్తకంబులలోని మాటలు విస్తరించుచు
ననుభవమ్ముల తత్త్వమెరుగక" వ్రాసేది కూడా ఒక కవిత్వమేనా అని ఈసడించుకున్నారు గురుజాడ.

జన సామాన్యం నుండి నుడులను, జాతీయాలను, లోకోక్తులను ఏరుకోవడం వేమన పాల్కురికి సోమనాథుని దగ్గర నేర్చుకుంటే, పదాలను పద్యాలలో పొదగడం తిక్కన నుండి నేర్చుకున్నారు.

"జౌనటంచు వాక్క డాడిన మాటకు
కాదటంచు బలుక క్షణము బట్టు
దాని విలువదీయ ధాతలు దిగవలె
విశ్వదాభిరామ వినురవేమ" అంటారు వేమన.

ఆయన ఒక పదాన్ని పద్యంలో ప్రయోగించారూ అంటే అది పతకంలో పొదిగిన మాణిక్యం లా నలు దిక్కులకూ కాంతి పుంజాలు విరజిమ్మ వలసిందే.

నిఘంటువుల్లో నిశ్చలంగా ఉండే పదాల కన్నా, నిత్యం జన సమూహం నాలుకల మీద కదలాడే నుడులసొగసును గుర్తించారు వేమన.

వేమన నుండి ఆ విద్యనే అభ్యసించారు గురజాడ.

వేమన చిన్ని చిన్ని మాటల్లో, రమ్యమైన జాతీయాల్లో గుండెలోతుల్ని తవ్విపోసి, అఖండ శిల్పాన్ని సాధించి, మహాకవుల లక్షణాల్ని పుణికి పుచ్చుకున్నారు.

నన్నయ నుండి ప్రాచీన కవులంతా రాజాశ్రయం లోనే కవిత్వం అల్లారు. రాజాస్థానపు సంకెళ్ళ నుండి బయటపడ్డ వారు పోతన.



పోతన ఆత్మ సంతృప్తికీ, కైవల్యానికీ కవిత్వం చెప్తే, వేమన ఆత్మ సంతృప్తికీ, ప్రజాభ్యుదయానికీ కవిత్వం చెప్పారు.

వేమన ఒకరి మెప్పుకోసం కవిత్వం చెప్పలేదు. తాను ఏది చెప్పదలచుకున్నా కుండ బద్దలు కొట్టినట్లు చెప్పారు.

**విమర్శకు హాస్యాన్ని పూతబెట్టి భేది మాత్రలా అందించే సాహిత్య పద్ధతికి వేమనే ఆద్యుడు.**



ఈ స్వేచ్ఛాగుణమె గురజాడలో అచ్చు గుద్దినట్లు కన్పిస్తుంది. గురజాడ విజయనగర సంస్థానంలో ఉన్నా, సంస్థానాధీశుల కోసం తన ఆదర్శాలకు స్వస్తి చెప్పుకోలేదు. ప్రజాభ్యుదయమే ఆయన ధ్యేయం. దాన్ని ముందుకు తీసుకెళ్ళడానికే ఆయన తన సర్వ శక్తులూ ఉపయోగించారు.

'నాది ప్రజోద్యమం, ఎవరినో సంతృప్తి పరచటానికోసం దాన్ని వదులు కోలేను' అని ధీమాగా పలికారు. గురజాడ వ్యావహారిక భాషను అలాగే వాడుకున్నారు.

'కన్యాశుల్క నాటకం' ద్వారా కన్యాశుల్క నిర్మూలన, బాల్య వివాహాల అనర్థం, విధవా వివాహాల ప్రోత్సాహం ప్రజలకి ఉద్బోధించారు.

వేమనలో కవీ, తత్త్వవేత్తా ఇద్దరూ సమపాళ్ళలో ఇమిడి ఉన్నారు. వేమన పద్యంలో మొదట హాస్యం కనబడు తుంది. ఆ వెంటే బాణంలాగా 'విమర్శ' తరుముకొని హృదయానికి సూటిగా వచ్చి నాటుకుంటుంది.

గురజాడ సంఘంలోని కుళ్ళును ఖండికల్లో సూటిగా చెప్పేస్తారు. ఆయన నాటకాల్లోనూ, వ్యాసాల్లోనూ, వ్యంగ్య ధోరణీ, నిశిత విమర్శ ఉంటుంది. విమర్శకు హాస్యాన్ని పూతబెట్టి భేది మాత్రలా అందించే సాహిత్య పద్ధతికి వేమనే ఆద్యుడు.

గాంధీజీ తన దారిని బుద్ధుని బోధనల్లో వెతుక్కున్నట్లే, గురజాడ వేమనలో వెదుక్కున్నాడు. మహాత్ముల తీరుతెన్నులే అవి. మంచి ఎక్కడున్నా గ్రహించి, తాము దానికి మెరుగులు దిద్దుతూ లోకానికి ఆదర్శ ప్రాయులవుతారు.

వేమనలో తన మార్గాన్ని స్థిరీకరించుకొన్న పిదప. కథా వస్తువు ఎలా ఉండాలో 'వర్డ్స్‌వర్త్' ద్వారా తెలుసుకున్నారు గురజాడ. ఆయన ఖండికల్లోని కథానాయికలంతా మధ్యతరగతికి చెందినవారు.

వేమన. గురజాడలకు సాహిత్యం జాతిని మేల్కొల్పడానికి ఒక మహత్తరమైన సాధనం. ఇద్దరి దృష్టి ప్రజాభ్యుదయం! ఇద్దరూ వాస్తవికతా వాదులు. మానవతావాదులు, కర్మ యోగులు.

గురజాడకు మార్గదర్శి వేమనే అనటానికి వీరిద్దరి కవిత్వాన్ని కూడా పరిశీలించాలి.

వేమనలో యుక్తి, రక్తి మొదలగు మార్గాన్వేషణ ఎంత ఉందో అంతకుమించి భక్తీ, ముక్తీ మొదలగు పరతత్త్వ సత్యాన్వేషణ ఉంది.

గురజాడ కవిత్వమంతా సమకాలీన సాంఘిక జీవితాన్ని చిత్రించడంలోనే కాలం గడిపినా. పరతత్త్వాన్ని నిర్వచించేది కూడా కొద్దోగొప్పో లేకపోలేదు. ఆ కోవలోదే 'మనిషి' అనే గేయం. అది మానవుని యొక్క అంతర్ముఖ లక్ష్యమేమిటో నిర్వచిస్తోంది.

ఈ తత్త్వంలో గూడా వేమనకీ, గురజాడకీ ఏకత్వమే కాని భిన్నత్వం లేదు.

"రాతిబొమ్మకేల రంగైన వలువలు
గుళ్ళు గోపురములు కుంభములును
కూడుగుడ్డ తాను కోరునా దేవుడు
విశ్వదాభిరామ వినురవేమ."

రాయి దేవుడైన రాసులు మ్రింగదా అని.. వేమన విగ్రహారాధన నిషేధిస్తే...

'మనిషిచేసిన రాయిరప్పకి
మహిమ కలదని సాగిమొక్కుతు
మనుషులంటే రాయి రప్పల
కన్న కష్టం'

అని వేమన భావాన్నే గురజాడ బలపరిచారు.

"గుహలోన జొచ్చి గురువుల వెదుకంగ
క్రూర మృగమొకండు తారసిలిన
ముక్తి మార్గ మదియే ముందుగా జూపురా
విశ్వదాభిరామ వినుర వేమ"

అని వేమన తన సహజ సుందరమైన వ్యంగ్యధోరణిలో అంటే, దాన్నే...

'దేవుడెకడో దాగెనంటూ
కొండ కోనల వెతకులాడేవేలా?'

అని. సూటిగా... ఘాటుగా అంటారు గురజాడ.

"తనదు నాత్మయందు దైవంబు గలుగంగ
తీర్థయాత్రలకేల తిరుగునరుడు
గంధపు తునకలను గాడ్దె మోసినయట్లు
విశ్వదాభిరామ వినురవేమ."

అని వేమన అంటే...

"కన్ను తెరచిన కానబడడో?
మనిషి మాత్రుడి యందులేడా
ఎరిగికోరిన కరిగి ఈడో - ముక్తి"

అని గురజాడ అంటారు.

ఇద్దరి మాటల్లో కించిత్తు భేదం కన్పిస్తున్నా. ఇద్దరి ఆత్మలూ ఒక్కటే!

డాక్టర్ పొన్నగంటి హనుమంతరెడ్డి
పి.జి.టి. తెలుగు
ఎ.పి.ఆర్.స్కూల్, కోడిగెనహల్లి,
హెచ్.ఎస్.మందిర్ - 616 212 ఎటిపి.